క్లుప్తంగా

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు



జడ్చర్ల: పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అగ్నిమాపక వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. బహుళ అంతస్తుల భవనాలు, ఆస్పత్రులు, పెట్రోల్ బంక్‌లు, సినిమా థియేటర్లు, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో ఎలా స్పందించాలి, ముందస్తు జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కొత్త బస్టాండ్‌లో ప్రయోగాత్మకంగా వివరించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్చర్ల ఫైర్‌స్టేషన్ అధికారి రాజేందర్, లీడింగ్ ఫైర్ మెన్ రాఘవేందర్, లక్ష్మీకాంత్‌రెడ్డి, నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్‌స్తంభం



జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని 10వ వార్డు పోచమ్మ ఆలయం వెనక ఇనుప విద్యుత్ స్తంభం కింది భాగం తుప్పుపట్టి ఓ వైపు ఒరిగింది. గాలులు బలంగా వీచినప్పుడు ప్రమాదం జరిగే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. పాత స్తంభం తొలగించి దాని స్థానంలో మరోటి ఏర్పాటు చేయాలని కోరుతూ పి.శ్రీనివాసులు గతేడాది అక్టోబర్ 19న డివిజన్ కార్యాలయంలో జరిగిన విద్యుత్ వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు స్తంభం మార్చడం, పటిష్టం చేసేందుకు విద్యుత్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పటికైనా స్పందించి స్తంభం మార్చాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రవిప్రకాశ్‌కు సేవారత్న పురస్కారం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రానికి చెందిన రవిప్రకాష్‌కు సేవారత్న పురస్కారంతో పాటు బెస్ట్ లీడర్ అవార్డు లభించింది. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో హ్యూమన్ రైట్స్ పబ్లిక్ ప్రొటెక్షన్ ఆధ్వర్యంలో జరిగిన ఓ కార్యక్రమంలో సంఘం జాతీయ అధ్యక్షుడు సత్యనారాయణ ఈ అవార్డు అందజేశారు. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని.. ఇక నుంచి మరింత బాధ్యతతో సేవా కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. మానవ హక్కుల పరిరక్షణకు పని చేస్తున్నందుకు తనకు ఈ అవార్డు లభించిందని చెప్పారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్‌కు చెందిన జయరాజ్‌గౌడ్ 2015లో అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయన కుమార్తె వివాహానికి స్నేహితులు, గార్లపహాడ్ ఉన్నత పాఠశాల 1993–94 పదోతరగతి విద్యార్థులు ఆదివారం రూ.50 వేల ఆర్థిక సాయాన్ని భార్య జయలక్ష్మి, కుమార్తెకు అందజేశారు. తమ మిత్రుడు చనిపోయాడని.. ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు గుర్తించి పెళ్లి జరుగుతున్న విషయం తెలుసుకొని ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు.

కొనసాగుతున్న కబడ్డీ పోటీలు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహిస్తున్న ఓపెన్‌టూ ఆల్ కబడ్డీ పోటీలు కొనసాగుతున్నాయి. కబడ్డీ పోటీలకు వెస్ట్ గోదావరి, అనంతపురం, ప్యాప్లి, రంగారెడ్డి, బైంసా, గద్వాల, నారాయణపేట, వనపర్తి జిల్లాల నుంచి మొత్తం 10 జట్లు పాల్గొంటున్నాయి. కబడ్డీ పోటీలు చూసేందుకు క్రీడాకారులు తరలివస్తున్నారు. మొదటి బహుమతిగా రూ.50 వే లు, రెండో బహుమతి రూ.40 వేలు, మూడో బ హుమతి రూ.30 వేలు, నాల్గో బహుమతి రూ.20 వేలు, ఐదో బహుమతి రూ.10 వేలు, ఆరో బహు మతి రూ.5 వేలు అందించనున్నారు.

అభివృద్ధి బాట.. నవాబుపేట



నవాబుపేట వ్యూ

- ముడా పరిధిలో ఇప్పటికే 18 గ్రామాలు
- తాజాగా హెచ్‌ఎండీఏ పరిధిలోకి మరో రెండు గ్రామాలు
- దేపల్లికి 107 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

నవాబుపేట: మండలంలో అతి త్వరలో అభివృద్ధి పరుగులు పెడుతుందని చెప్పవచ్చు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముడా (మహబూబ్‌నగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ని ఏర్పాటుచేసి దాని పరిధిలోకి మండలంలోని 18 గ్రామాలు తీసుకున్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్ చుట్టూ పలు వరుసల రహదారులు వస్తున్న నేపథ్యంలో హెచ్‌ఎండీఏ (హైదరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ) పరిధిలోకి మండలంలోని దేపల్లి, కాకర్‌జాల్ గ్రామాలు చేర్చారు. జాతీయ రహదారికి అతి చేరువలో ఉన్న రెండు గ్రామాలు హెచ్‌ఎండీఏ పరిధిలోకి చేరడంతో మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

ముడా పరిధిలోని గ్రామాలు..

మండల కేంద్రంతో పాటు తీగలపల్లి, సిద్దోటం, కాకర్లపహాడ్, కారుకొండ, కూచూర్, హన్మసానిపల్లి, రుద్రారం, కొండాపూర్, యన్మన్‌గండ్ల, హాజిలాపూర్, దయాపంతులపల్లి, ఇప్పటూర్, కారూర్, చెన్నారెడ్డిపల్లి, మల్లారెడ్డిపల్లి, దొడ్డిపల్లి, లోకిరేవు ఉన్నాయి. మొత్తం 42 గ్రామాల్లో 20 ముడా పరిధిలో ఉండటంతో ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు అధికంగా మంజూరు చేసేందుకు అవకాశం ఉంటుంది. మండల సరిహద్దు నుంచి ఇతర మండలాలకు ఉన్న రోడ్లు రెండు వరుసలుగా మారుతున్నాయి. హెచ్‌ఎండీఏ పరిధిలో చేరిన దేపల్లి జాతీయ రహదారికి 14 కిలోమీటర్లు, కాకర్‌జాల్ 16 కిలోమీటర్ల దూరంలో ఉన్నాయి. ఇప్పటికే ఆయా గ్రామాల్లోని భూములకు మండలంలో ఎక్కడా లేని విధంగా భూముల ధరలు ఉన్నాయి. తాజా ప్రకటనతో మరింత పెరిగే అవకాశం ఉంది.

సంతోషంగా ఉంది..



హెచ్‌ఎండీఏ పరిధిలోకి గ్రామాన్ని చేర్చడం చాలా సంతోషంగా ఉంది. ఇప్పటికే గ్రామ పరిధిలోని వందల ఎకరాల భూములు హైదరాబాద్‌కు చెందిన వారు కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నారు. అలాగే పోలిమేరల్లో ఫాంహౌజ్‌లు ఏర్పాటవుతున్నాయి. కనీసం బస్సులు రాని గ్రామంలో అభివృద్ధి జరుగుతుందని చాలా ఆశగా ఉంది.

– వెంకటేష్‌గౌడ్, దేపల్లి

జిల్లాకేంద్రానికి దగ్గరగా ఉన్నా..



జిల్లాకేంద్రానికి దగ్గరగా ఉన్నా పలు గ్రామాలు అభివృద్ధిలో వెనకబడ్డాయి. వాటిని అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతోనే ముడాలో చేర్చారు. ముడా ఏర్పాటై రెండేళ్లు గడిచినా ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదు. అధికారులు ఇప్పటికైనా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

– చెన్నయ్య, ముడా మాజీ డైరెక్టర్

అలాగే దేపల్లి గ్రామపంచాయతీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడంతో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి 107 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయించగా నిర్మాణాలు కూడా ప్రారంభమయ్యాయి.

సమస్యలు పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 42వ డివిజన్ పరిధిలోని జగ్జీవన్‌రాంనగర్ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఆదివారం ఆయన ఆకస్మికంగా కాలనీలో పర్యటించి జిల్లా క్రీడా మైదానం వెనుక భాగంలో నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ స్థలాన్ని వెంటనే చదును చేయించి జిల్లా క్రీడా మైదానానికి కేటాయించాలని పుర కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డిని ఆదేశించారు. అనంతరం కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీసీ రహదారులు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, వాటర్ ట్యాంకు నిర్మించాలని, సామూహిక భవనంపైన విద్యార్థుల కోసం షెడ్ ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ ప్రధానకార్యదర్శి వినోద్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు



జడ్చర్లలోని కల్వరికొండపై సందేశమిస్తున్న రెవ రాజశేఖర్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈస్టర్ పండుగను పురస్కరించుకొని ఆదివారం పట్టణంలోని చర్చిల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక కల్వరి ఎంబీ చర్చిలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన డా. ఏజే ఏసు సందేశం ఇవ్వగా.. పాస్టర్ రెవరెండ్ ఎస్.వరప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో వైస్ చైర్మన్ బీఐ జేకబ్, కార్యదర్శి జేఐ డేవిడ్, సహాయ కార్యదర్శి ఇమ్మాన్యుయల్‌రాజ్, కోశాధికారి టీఏ స్టీవెన్, సహ కోశాధికారి టైటస్ రాజేందర్, బీఏ విక్టర్, దాసరి సందర్, అబ్రహం, నిక్సన్, కేఆర్ ఫిలిప్, క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జడ్చర్లలో..

జడ్చర్ల టౌన్: పట్టణంలోని కల్వరికొండపై ఆదివారం యునైటెడ్ క్రిస్టియన్స్ ఆధ్వర్యంలో ఈస్టర్ సూర్యోదయ ఆరాధన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. పట్టణ నలుమూలల్లో ఉన్న క్రిస్టియన్లు కొండపైకి చేరుకోగా.. ముఖ్యఅతిథిగా హాజరైన రెవ రాజశేఖర్ సందేశమిచ్చారు. ఏసుక్రీస్తు మరణాన్ని జయించారని, సర్వమానవాళి కోసం తను చూపించిన ప్రేమ, విధేయత, నమ్మకం మనందరికి స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో పాస్టర్ విలియం బూత్, సంఘ పెద్దలు ఫిలమోన్, తిమోతి, జైపాల్, నిత్యానందం, లూథర్, మైకెల్ మనోహర్, దేవదానం, ఎబినేజర్, ఐజాక్, ప్రీతమ్, సందీప్, జాన్సన్, రూబెన్, టైటాస్, ఆశీర్వాదం, నతానియేల్, మోజస్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎంబీ బేథని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణలో విద్యావ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు డా. చారకొండ వెంకటేష్ అన్నారు. ఆదివారం స్థానిక లక్ష్మీనగర్‌కాలనీలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ప్రధానోపాధ్యాయుడు వడ్డెమాన్ బాలపీర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకుంటూ ముందుకు సాగుతోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో విద్యా కమిషన్ ఏర్పాటు చేశారని.. అన్ని కులాల విద్యార్థులు కలిసి చదువుకునేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు నెలకొల్పుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కల్వదర్శి చైతన్య, ప్రధానకార్యదర్శి మార్వాడి గంగరాజు, అదనపు ప్రధానకార్యదర్శి కావలి రమేష్, కోశాధికారి బాల్‌శంకర్, జిల్లా అధ్యక్షుడు పట్నం చెన్నయ్య, ప్రధానకార్యదర్శి కాడం బాల్‌శంకర్, సంఘం నాయకులు సందీప్, విజయ్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన మైసమ్మ ఆలయం



నవాబుపేట: మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ ఆలయం ఆదివారం కిటకిటలాడింది. ఉదయమే అర్చకులు అమ్మవారిని అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులను దర్శనానికి అనుమతించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం సెలవురోజు, అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో భక్తులు భారీగా తరలివచ్చారు.

శ్రీలక్ష్మీ నరసింహస్వామి రథోత్సవం

ఖిల్లాఘనపురం: మండలంలోని సోళీపురంలో ఆదివారం మధ్యరాత్రి నిర్వహించిన శ్రీలక్ష్మీనరసింహ యోగానందస్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారి మహోత్సవాల్లో భాగంగా ఈ నెల 19 నుంచి ఉత్సవాలు నిర్వహించారు. ఆదివారం మధ్యరాత్రి స్వామివారిని తేరుపైకి చేర్చి భక్తులు పెద్ద సంఖ్యలో పోటాపోటీగా రథాన్ని ముందుకు లాగుతూ స్వామివారి నామాన్ని స్మరించారు. తేరుగడ్డ వరకు లాగి అక్కడ పూజలు నిర్వహించి తిరిగి దేవాలయం దగ్గరకు తీసుకొచ్చారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తీర్థావళి కార్యక్రమంలో భాగంగా స్వామివారిని, పాదుకలను గ్రామంలో ఊరేగింపు చేశారు. అనంతరం దేవాలయం దగ్గర ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కోనేరులో చక్రస్నానం చేయించి దేవాలయం లోకి చేర్చారు. దేవాలయం దగ్గర అన్నదానం ఏర్పాటు చేశారు. స్వామి వారి మాలాధరణ చేసిన స్వాములు దీక్షను విరమించారు. దాతల సహకారంతో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.



‘చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం’

గండేడ్: రైతులు పండించిన వరి ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని రెడ్డిపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని చెప్పుకోవడానికి గర్వంగా ఉందని.. దేశంలో సన్నరకం వరి ధాన్యానికి బోనస్ ఇస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని తెలిపారు. ధాన్యం కొన్న రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు భగవంత్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రఘురాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, మాధవరెడ్డి, సాయిలు, చెన్నయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ

అ‘పూర్వ’ సమ్మేళనం



వీరన్నపేట ప్రభుత్వ పాఠశాలలో 2004-05 పదోతరగతి విద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక వీరన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2004–05 పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. అప్పట్లో పనిచేసిన ఉపాధ్యాయులు శ్రీశైలం, నాగేందర్, రామలింగం, బాబు, సాయినాథ్, డాక్యానాయక్, అన్నపూర్ణ, హతిరాం, రమేష్, నాగరాజు సైతం కార్యక్రమంలో పాల్గొన్నారు.

- న్యూమోతీనగర్‌లోని ఆదిత్య స్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1993 నుంచి 2025 వరకు చదువుతున్న విద్యార్థులందరూ ఒకచోట చేరి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, ఉపాధ్యాయులు రుక్మిణి, లక్ష్మి, మహేందర్, పూర్వ విద్యార్థులు నరేందర్, జగదీశ్వర్, కొండయ్య, విజయలక్ష్మి, భార్గవి, యాదయ్య, అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 2002–03 పదోతరగతి విద్యార్థులు ఆదివారం గురువులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. నాటి గురువులు శివకుమార్, శ్రీగౌడ్, రామచంద్రయ్య, శ్రీధర్, విద్యావతి, లావణ్య, కృష్ణవేణి, పూర్వ విద్యార్థులు విష్ణువర్ధన్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌గౌడ్, కేశవర్ధన్‌గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: మండలంలోని గార్లపహాడ్ ఉన్నత పాఠశాల 2004–2005 పదో విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. నాటి ఉపాధ్యాయులు హన్మంతరావు, రవీందర్, అరుణ, హసీబా, కృష్ణారెడ్డి, రాములు, బాలకిష్టప్పను పూర్వ విద్యార్థులు సన్మానించారు.

ప్రశాంతంగా బీసీ గురుకుల ప్రవేశ పరీక్ష

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించారు. మొత్తం 4 పరీక్ష కేంద్రాల్లో 912 మంది విద్యార్థులకుగాను.. 816 మంది హాజరుకాగా, 96 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. డీఈఓ ప్రవీణ్‌కుమార్, బీసీ గురుకుల అధికారులు పలు పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

‘పది’ విద్యార్థులకు ఉచిత శిక్షణ

జడ్చర్ల టౌన్: వచ్చే విద్యాసంవత్సరం తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో పదోతరగతి చదివే విద్యార్థులకు ఈ నెల 25 నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు అవోపా అధ్యక్షుడు ఎలిశెట్టి మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. స్థానిక ఉదయ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు శిక్షణ కొనసాగుతుందని.. ఆసక్తిగల విద్యార్థులు సెల్‌ఫోన్ నంబర్ 97056 78941 పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

నేడు కొనుగోలు కేంద్రం ప్రారంభం

జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్‌లో సోమవారం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించనున్నట్లు ఏపీఎం మాల్యానాయక్ తెలిపారు. గ్రామ రైతులు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కేఎస్పీ కాల్వలకు మరమ్మతులు చేయాలి

మరికల్: కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద యాసంగి పంటల కోతలు ముగియగానే కాల్వలు, తూములను మరమ్మతులు చేయాలని రైతులు బాల్‌రాజ్‌గౌడ్, రాములు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. తీలేర్ నుంచి మరికల్ మీదుగా ఇబ్రహీంపట్నం శివారు వరకు కేఎస్పీ పిల్ల కాల్వ కింద దాదాపు 2 వేల ఎకరాల ఆయకట్టు ఉన్నట్లు తెలిపారు. ఈ కాల్వ ముళ్లచెట్లతో అల్లుకుపోవడంతో చుక్కనీరు ముందుకు రావడం లేదన్నారు. ముళ్లచెట్లను తొలగించి కాల్వలను మరమ్మతులు చేసి తూములు ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా వేసవిలో నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేయాలని వారు అధికారులను కోరారు.

శివాజీ ఆశయ సాధనకు యువత కృషి : ఎంపీ



రాజాపూర్: యుద్ధతంత్రాలు, పరిపాలన విధానంలో ఛత్రపతి శివాజీ భారతదేశ రాజుల్లో అగ్రగణ్యుడని.. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ కోరారు. ఆదివారం మండలంలోని చెన్నవెల్లిలో ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహాన్ని ఆదివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత అన్నిరంగాల్లో ముందుకుసాగడంతో పాటు సమసమాజ స్థాపనలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. కార్యక్రమంలో ఆదిపరాశ్రీస్వామి, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు అభిమన్యురెడ్డి, శ్రీశైలంయాదవ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. మహాదానం



అడ్డాకుల: రక్తదానం.. మహాదానమని స్నేహ ఫామ్స్ డైరెక్టర్ రామేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం జాతీయ వాలంటీర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రం సమీపంలోని స్నేహ ఫామ్స్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ లయన్ నటరాజ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందగా ముందుకొచ్చి రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. 57 మంది స్నేహ ఫామ్స్ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఫామ్స్ మేనేజర్ ఓబుల్‌రెడ్డి, సిబ్బంది, రెడ్‌క్రాస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గాలి వాన బీభత్సం

- నేలకొరిగిన వరి పంట.. తడిసిన ధాన్యం
- నేలరాలిన మామిడి కాయలు



వాడ్యాల్‌లో నేలకొరిగిన వరి పంట



మిడ్జిల్ మండలంలో నేలరాలిన మామిడి కాయలు

మిడ్జిల్: మండలంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. కోత దశకు వచ్చిన వరి పంటలు నేలవాలగా.. భారీగా మామిడి కాయలు రాలిపోయాయి. రైతులు కోసి ఆరబెట్టిన వరి ధాన్యం కూడా తడిసి ముద్దయింది. మండలంలో వందలాది ఎకరాల్లో వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

తడిసిన వరి ధాన్యం

చిన్నచింతకుంట: మండలంలోని అమ్మాపురం, గూడూర్, తిర్మలాపురంలో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో కల్లాలలో వరి ధాన్యం తడిసి ముద్దయింది. రైతులు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు కప్పేందుకు నానా అవస్థలు పడ్డారు.

కూలిన రేకుల షెడ్.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండలాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. అడ్డాకుల మండలంలోని బలీదుపల్లి, కన్మనూర్‌లో పలుచోట్ల విద్యుత్ తీగలు తెగిపోగా, ఓ రైతుకు చెందిన రేకుల షెడ్ నేలకూలింది. మూసాపేట మండలంలోని పలు గ్రామాల్లో సర్వీస్ రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యం తడిసిపోయింది.



బలీదుపల్లిలో కూలిన రేకుల షెడ్



అమ్మాపురం గ్రామంలో కురుస్తున్న వర్షం